క్లుప్తంగా

రాజభాష అమలులో టోలిక్ కృషి అభినందనీయం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఎండీ, డైరెక్టర్ తదితరులు

ఉక్కునగరం: రాజభాష హిందీ అమలుకు టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (టోలిక్) చేస్తున్న కృషి అభినందనీయమని టోలిక్ చైర్మన్, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో 2023-24 మొదటి అర్ధ సంవత్సరంలో రాజభాష అమలులో టోలిక్ కార్యాలయాల పనితీరుపై శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23లో విశాఖపట్నం ఉత్తమ టోలిక్‌గా ఎంపిక కావడం హర్షణీయమన్నారు. సభ్య సంస్థలు సాధించిన పురోగతిని అధికార భాష అమలు డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిశ్వాస్ కొనియాడారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ హిందీ ఇన్ హౌస్ మ్యాగజైన్ 'సుగంధ్' తాజా సంచికను ఆవిష్కరించారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి.పాండే, టోలిక్ మెంబర్ సెక్రటరీ లలన్‌కుమార్, ఉక్కు రాజభాష ఏజీఎం టి.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అక్షయపాత్ర సేవా పురస్కారాలు



అవార్డు గ్రహీతలతో డీఈవో చంద్రకళ, హెచ్ఎం విజయప్రశాంతి

గాజువాక : గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం సరఫరాలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులకు అక్షయపాత్ర ఫౌండేషన్ సేవా అవార్డులను ప్రదానం చేసింది. నగరంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో గాజువాక హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు పి.విశ్వేశ్వరరావు, సీహెచ్.కమలరత్నంతో పాటు విద్యార్థులు ఎస్.తేజేష్, పి.మౌనిక, సీహెచ్.భవ్యశ్రీలకు జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి అవార్డు గ్రహీతలను అభినందించారు.

పరిశ్రమల ఏర్పాటుపై విద్యార్థులకు అవగాహన



ఎంఎస్ఎంఈ ఏడీ శ్రీనును సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

అగనంపూడి: విద్యార్థులు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ప్రారంభించడానికి రూపొందించిన పథకాలు, కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్రీను అన్నారు. విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై విద్యార్థులకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంబీఏ హెచ్‌వోడీ డాక్టర్ బి.చంద్ర, కో-ఆర్డినేటర్ ఎం.శ్రీను, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

'విద్యుత్ చార్జీలు తగ్గించాలి'

గాజువాక : పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ గాజువాక బీజేపీ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో నాయకులు చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సోంబాబు, బాటా శ్రీను, గూటూరు శంకరరావు, వి.రోహిణి, కట్టా పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇది కదా అభివృద్ధి

జలాల పరిరక్షణ.. ప్రజారోగ్య రక్షణ

ఆహ్లాదకర వాతావరణంలో కోనేరు నుంచి వీచే చల్లని గాలిని ఆస్వాదిస్తూ .. వాకింగ్ చేస్తే ఆ హాయే వేరు. అక్కడే చిన్నారుల ఆటపాటల కోసం ప్లే ఏరియా, పెద్దల కోసం ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్.. అన్నీ ఒకే ప్రాంతంలో ఏర్పాటైతే ఆరోగ్యాభిలాషులకు అంతకంటే ఆనందం ఏం ఉంటుంది. అలాగే.. కొండవాలు ప్రాంతాల నుంచి జాలువారే ప్రతీ వర్షపు నీటిబొట్టును ఒడిసి పడితే భవిష్యత్తు తరాలకు నీటి కొరత అన్న మాటే లేకుండా ఉండదు. ఇలా జలాల పరిరక్షణ.. ప్రజారోగ్య సంరక్షణ చేపట్టేలా కోట్ల రూపాయలతో ప్రభుత్వం అగనంపూడిలో కోనేరును అభివృద్ధి చేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అభివృద్ధి చేస్తున్న కోనేరు

- అద్భుత రీతిలో లంకెలపాలెం కోనేరు అభివృద్ధి
- రూ. కోటి 20 లక్షలతో పనులు
- కోనేరు చుట్టూ వాకింగ్ ట్రాక్
- స్థానికుల హర్షం

అగనంపూడి: పచ్చదనం, నగర సుందరీకరణలో భాగంగా 79వ వార్డు లంకెలపాలెం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కోనేరును అభివృద్ధి చేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో పది చెరువులను అభివృద్ధి చేస్తుండగా వాటిలో కోనేరు కూడా ఒకటి కావడం విశేషం. అమృత్ పథకంలో రూ.కోటి ఇరవై లక్షలతో సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు.

చురుగ్గా పనులు

అభివృద్ధిలో భాగంగా చెరువు గట్టును చదును చేయడం, కోనేరు గర్భంలో మట్టిని తొలగించడం, గట్టు జారిపోకుండా అంతర్భాగంలో రాళ్లు పేర్చడం, ఆవరణ చుట్టూ ప్రహరీ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు, పిల్లలు ఆడుకునేందుకు అవసరమైన క్రీడా పరికరాలు అమర్చడం, జాతీయ రహదారికి ఆవలవైపు ఉన్న కొండవాలు ప్రాంతం నుంచి జాలువారే వర్షపునీటిని ఒడిసి పట్టి చెరువులోకి మళ్లించడం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. వాటిలో ప్రస్తుతం వాకింగ్ ట్రాక్ నిర్మాణంలో ఉంది. చెరువు లోపల మట్టిని ఒక పార తొలగించారు. గట్టు జారిపోకుండా రాళ్లు పేర్చడం పూర్తి చేశారు. కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి చర్యలు ప్రారంభించారు. ఓపెన్ జిమ్ ఏర్పాటుకు స్థలాన్ని చదును చేశారు. మూడు మాసాల్లో పనులు పూర్తి చేయాలనే తలంపుతో అధికారులు కృషి చేస్తున్నారు.

లంకెలపాలెం కోనేరు

నిధులు : రూ.1 కోటి 20 లక్షలు

చేపట్టనున్న పనులు

వాకింగ్ ట్రాక్ నిర్మాణం
రక్షణ గోడ ఏర్పాటు
ఓపెన్ జిమ్
చిల్డ్రన్స్ ప్లే ఏరియా
కొండవాలు నుంచి
వర్షపునీరు ఒడిసిపట్టేలా చర్యలు



కోనేరు గట్టున వాకింగ్‌ట్రాక్ నిర్మాణం



చెరువు గట్టు కోతకు గురవకుండా మట్టిని తీసి రాయి పేర్చుతున్న దృశ్యం

ఆహ్లాదం.. ఆనందం



వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఒకేచోట ఏర్పాటు చేయడం బాగుంది. పిల్లలను తీసుకుని సాయంత్రం వచ్చేస్తే, వాళ్లు ఆడుకుంటూ ఉంటారు, మాకు వాకింగ్, జిమ్ కూడా పూర్తవుతాయి. ఆహ్లాదకర వాతావరణంలో అటు ఆరోగ్యం.. ఇటు ఆనందం. మంచి ఏర్పాటు.

– ఎం.వి.నాగేశ్వరరావు, వినాయకనగర్ కాలనీ

అన్నీ ఒకే చోట.. బాగుంది



ఇప్పటి వరకు జాతీయ రహదారిపై లేదా గ్రామంలోని రోడ్లు మీద వాకింగ్ చేయాల్సి వచ్చేది. మహిళలు, వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు వందలాది మంది ఉదయం వాకింగ్ కోసం ఇబ్బంది పడేవారు. పిల్లలు సెలవుల్లో రోడ్లు మీద, ఇళ్ల మధ్యలో ఆటలాడుతున్నారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు పూర్తయితే అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉంటుంది.

– కింతాడ ఈశ్వరరావు, గంగిరెడ్ల కాలనీ

ఇన్నాళ్లకు సాకారం



లంకెలపాలెం ప్రాంతంలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ కావాలని ఎప్పటి నుంచో అడుగుతున్నాం. ప్రభుత్వం స్పందించి వాకింగ్ ట్రాక్‌తోపాటు నీటి వనరులను కాపాడానికి కొండవాలు ప్రాంతం నుంచి వర్షపునీరు వృథాగా పోకుండా చర్యలు చేపడుతుండడం సంతోషం, వేసవిలో చెరువులో నీరు ఉంటే పరిసరాల్లో భూగర్భ జలాలు అవస్థలు పడాల్సి ఉండదు.

– యలమర్తి వెంకటరావు, లంకెలపాలెం

త్వరలో అందుబాటులోకి..

సివిల్ వర్క్స్‌కు రూ.58 లక్షలు, మిగిలిన పనులకు రూ.52 లక్షలు కేటాయించి, పనులు చేపట్టాం. ఆవరణలో మరుగుదొడ్లు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రధాన గేటు ఏర్పాటుతో పాటు సెక్యూరిటీ గార్డ్ కోసం గదిని నిర్మించాల్సి ఉంది. త్వరలో పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకువస్తాం.

– శ్రీనివాసరావు, ఏఈ, అర్బన్ గ్రీనరీ బ్యూటిఫికేషన్ విభాగం

కూల్ హెల్మెట్ ప్రాజెక్ట్‌కు ప్రథమ స్థానం

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు అర్హత సాధించిన గంగవరం ఉపాధ్యాయుడు



ప్రథమ బహుమతి అందుకుంటున్న రాజారావు



కూల్ హెల్మెట్

పెదగంట్యాడ: జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో గంగవరం పాఠశాల ఉపాధ్యాయుడు రాజారావు రూపొందించిన కూల్ హెల్మెట్ ప్రాజెక్ట్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. కెమిస్ట్రీ పీజీటీగా పని చేస్తున్న ఆయన టీచర్ ఎగ్జిబిట్ విభాగంలో ప్రథమ స్థానం సొంతం చేసుకున్నారు. ఈ మేరకు వేపగుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో ఆయనకు జ్ఞాపికను బహూకరించారు. జిల్లా స్థాయిలో సత్తా చాటిన ఆయన ఈ నెల 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు అర్హత సాధించారు. ఆయన మాట్లాడుతూ తాను తయారు చేసిన హెల్మెట్ శీతాకాలంతో పాటు వేసవికాలంలోనూ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గనుల్లో పని చేసే వారికి కూడా ఉపయోగపడుతుందన్నారు.

అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు

పెదగంట్యాడ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలను అందజేయడమే వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ఉద్దేశమని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. 76వ వార్డు నడుపూరు గాంధీపార్కు వద్ద జోనల్ కమిషనర్ సింహాచలం అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు బీమా కార్డులను పంపిణీ చేశారు. డాక్టర్ హేమలత, అప్పలరాజు, భువనేశ్వరి, సోంబాబు, నాగేశ్వరరావు, రోహిణి, పద్మ, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జిందాల్‌తో ఎంవోయూ రద్దు చేయాలి

- కార్మిక సంఘాల డిమాండ్
- వివిధ విభాగాధిపతులకు వినతులు



ఎస్ఎంఎస్ విభాగాధిపతికి వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

ఉక్కునగరం: జిందాల్‌తో జరిగిన ఎంవోయూను రద్దు చేయాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సిటూ ఆధ్వర్యంలో విభాగాధిపతుల కార్యాలయాల వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నూరు శాతం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు 1044 రోజులుగా దీక్షలు చేస్తున్నా.. ఉక్కు యాజమాన్యం ఈవోఐ పేరిట జిందాల్‌తో రూ. 500 కోట్లకు రెండేళ్ల ఒప్పందం చేసుకోవడం దుర్మార్గమన్నారు. దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఆ ఒప్పందాన్ని రద్దు చేసి సెయిల్‌తో ఎంవోయూ చేసుకోవాలని లేదా సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మూడు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రారంభోత్సవానికి ఆహ్వానం



ఎంపీ నందిగాం సురేష్‌ను ఆహ్వానిస్తున్న నాయకులు

గాజువాక : పెదగంట్యాడ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ప్రారంభోత్సవానికి విచ్చేయాలని బాపట్ల ఎంపీ నందిగాం సురేష్ సహా పలువురు ప్రముఖులను పెదగంట్యాడ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆహ్వానించారు. అసోసియేషన్ సభ్యులు గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఇప్పటికే మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి ఆహ్వాన పత్రం అందజేశామని, మంత్రులు మేరుగు నాగార్జున, తానేటి వనిత, ఆదిమూలం సురేష్ తదితరులను కూడా ఆహ్వానించామని పేర్కొన్నారు. నందిగాం సురేష్‌ను కలిసిన వారిలో ఎస్సీ, ఎస్టీ అసోసిషన్ నాయకులు రాజారావు, శ్రీదేవి తదితరులున్నారు.

సీఎం జగన్ పాలనలో మహిళలకు అగ్రస్థానం



వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఉరుకూటి చందు

అక్కిరెడ్డిపాలెం: మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలోని సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో చందు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రంగాల్లో మహిళలకు అగ్రస్థానం కల్పిస్తున్నారన్నారు. వార్డు అధ్యక్షుడు బోగాది మాట్లాడుతూ వెంకటేశ్వర కాలనీ సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.11,25,08,919 అందజేశారన్నారు. బుక్‌లెట్లు ఆవిష్కరించారు. సంక్షేమ పథకాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించి, వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో వార్డు మహిళా అధ్యక్షురాలు కమరున్నీసా బేగం, గాజువాక మండల అధ్యక్షుడు ఎస్ఎండీ గౌస్, బీసీ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు వీర్రాజు, పెట్టి అప్పారావు, మళ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లెక్కల ముగ్గులు



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో శ్రీనివాస రామానుజన్ చిత్రంతో ముగ్గు వేస్తున్న విద్యార్థినులు

- అంకెలు, గణిత సూత్రాలను రంగవల్లికల్లో పొందుపరిచిన విద్యార్థులు
- అబ్బురపరిచిన గణిత వైజ్ఞానిక ప్రదర్శనలు



నడుపూరు పాఠశాలలో విద్యార్థులు వేసిన లెక్కల ముగ్గు

పెదగంట్యాడ: కఠినమైన గణితాన్ని సులభరీతిలో ముగ్గుల్లో పొందుపరిచి అబ్బురపరిచారు నడుపూరు హైస్కూల్ విద్యార్థులు. అంకెలు, గణిత సూత్రాలతో ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. పాఠశాలలో గణిత వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన వర్కింగ్ మోడల్స్ ఆకట్టుకున్నాయి. గణిత సూత్రాలను ఆకర్షణీయంగా తయారు చేశారు. విద్యార్థులు యోగా గణిత భావనలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యార్థులకు ఆన్‌లైన్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం గణిత మేళాను పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ ప్రారంభించారు. వివిధ నమూనాలను ప్రదర్శించారు. సూర్యకిరణ్, షర్మిల, శ్రీనివాసులు, శ్రీధర్ పాల్గొన్నారు.

యారాడ పాఠశాలలో..

64వ వార్డు యారాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్ఎం సుబ్రహ్మణ్యం, గణిత ఉపాధ్యాయుడు సరోజ్‌కుమార్ తదితరులు గణిత వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. విద్యార్థులు తాము రూపొందించిన వివిధ ప్రాజెక్టులను వివరించి ఆకట్టుకున్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మ్యాథ్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు.

గాజువాక హైస్కూల్‌లో..

గాజువాక : గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. వారం రోజుల పాటు ఆన్‌లైన్ గణిత క్విజ్ నిర్వహించిన ఉపాధ్యాయులు శుక్రవారం లైవ్ క్విజ్, గణిత ముగ్గుల పోటీలు, గణిత పాటల పోటీలు, గణిత వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు, గణిత డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి మాట్లాడుతూ రామానుజన్ గొప్పదనాన్ని వివరించారు.విద్యార్థులు వివిధ రకాల కృత్యాలతో ప్రదర్శన నిర్వహించారు.

కణితి హైస్కూల్‌లో..

కూర్మన్నపాలెం: కణితి హైస్కూల్‌లో విద్యార్థులు చక్కని ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉత్తమ ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. హెచ్ఎం సూర్యప్రకాశరావు మాట్లాడుతూ దేశానికి గర్వకారణమైన ఆర్యభట్ట, బ్రహ్మగుప్తుడు, శ్రీనివాస రామానుజన్, సత్యేంద్రనాథ్ బోస్, శకుంతలాదేవి తదితరుల గురించి వివరించి, గణితం ఆవశ్యకతను తెలియజేశారు.



కణితి హైస్కూల్లో లెక్కల చెట్టు

అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో..

అక్కిరెడ్డిపాలెం: గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని మింది, అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూళ్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులు 100కు పైగా గణిత నమూనాలను ప్రదర్శించారు. హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం వాటిని పరిశీలించి, విద్యార్థులను ప్రశంసించారు. పాఠశాల ప్రాంగణంలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటంతో విద్యార్థులు వేసిన రంగవల్లిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణిత ఉపాధ్యాయులు బి.దామోదర రెడ్డి, ఆర్.వేణు, మాధురి తదితరులు పాల్గొన్నారు.

– మింది ఉన్నత పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్.ఆంజనేయ పూలమాల వేసి, నివాళులర్పించారు. విద్యార్థులు గణిత శాస్త్ర నమూనాలను ప్రదర్శించారు. గణిత చిహ్నాలతో రూపొందించిన దుస్తులను ధరించి విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు గాయత్రి, ఉమాదేవి, చైతన్యలక్ష్మి, జ్యోతి, జయలక్ష్మి, ఎస్.రమణ తదితరులు పాల్గొన్నారు.



గాజువాక హైస్కూల్‌లో గణిత కృత్యాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



డ్రెస్‌పై గణిత చిహ్నాలు ధరించిన మింది జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు



నడుపూరు పాఠశాలలో గణిత వైజ్ఞానిక ప్రదర్శన

వినియోగదారుల హక్కులపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి, చిత్రంలో కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: వినియోగదారులు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెదగంట్యాడ మండల తహసీల్దార్ రమాదేవి అన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ జిల్లా ఆసరా ఆధ్వర్యంలో దబ్లివానిపాలెం సచివాలయంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వినియోగదారులు హక్కులు తెలుసుకోవాలని సూచించారు. 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి మాట్లాడుతూ కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు విధిగా బిల్లులు తీసుకోవాలని వినియోగదారులకు సూచించారు. ఆసరా కన్వీనర్ తోట శత్రుఘ్నుడు మాట్లాడుతూ ఆసరా ద్వారా వినియోగదారుల్లో చైతన్యం తీసుకువస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో తవ్వా కృష్ణ, సచివాలయ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యూత్ క్రిస్మస్ వేడుకలు



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న యువతీ యువకులు

గాజువాక : గాజువాక బీసీ రోడ్‌లోని యునైటెడ్ బాప్టిస్ట్ చర్చిలో యూత్ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చర్చి అధ్యక్షుడు పుచ్చా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో యువతీ యువకులు ఆటలు, పాటలు, డ్యాన్సులతో సందడి చేశారు. కార్యక్రమంలో చర్చి కార్యదర్శి బీఎస్ఎస్ఎన్ మనోహర్, ట్రెజరర్ ఎబ్బీ మోజెస్, వై.డి.సుధాకర్, పి.ఆనంద్‌రావు, ఎం.పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే 'ఉక్కు' పరిరక్షణ



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: తెలుగువారి ఆత్మ గౌరవానికి నిదర్శనంగా నిలిచిన విశాఖ ఉక్కుపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు తెలుగువారికి తీవ్ర అభ్యంతరం కలిగిస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో శుక్రవారం, 1044వ రోజు కార్మికులు పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళితులు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని ఐక్య పోరాటాలతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.